# సాక్షి
## పశ్చిమగోదావరి

ఆదివారం | 12 | అక్టోబర్ | 2025






### భక్తజన సంద్రం
ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రం భక్తజన సంద్రాన్ని తలపించింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 8లో ▸



### మద్యం కిక్కులో జేబుకు చిల్లు
కూటమి నేతలు విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తూ రూ.కోట్లు గడిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే బెల్టుషాపుల హవా భారీగా ఉంది. 8లో ▸



### చిచ్చర పిడుగులు
ఏలూరు ఇండోర్ స్టేడియంలో జిల్లాస్థాయి స్కేటింగ్ పోటీలు ఆకట్టుకున్నాయి. చిన్నారులు చిచ్చర పిడుగుల్లా దూసుకుపోయారు. 8లో ▸

## న్యూస్‌రీల్

### కిడ్నాప్ కలకలం
**తాడేపల్లిగూడెం అర్బన్:** తాడేపల్లిగూడెంలో ఒక వ్యక్తిని కిడ్నాప్ చేసిన ఘటన కలకలం రేపింది. శనివారం ఉదయం ఓ వ్యక్తి పోలీస్‌స్టేషన్ సెంటర్‌కు వచ్చి దుకాణం వద్ద టీ తాగుతున్నాడు. ఇంతలో ఓ కారులో నుంచి ముఖానికి ముసుగులు ధరించిన కొందరు వ్యక్తులు దిగి టీ తాగుతున్న వ్యక్తిని బలవంతంగా కారులో ఎక్కించుకుని తీసుకువెళ్లారు. దీంతో అక్కడున్న వారు నిర్ఘాంతపోయారు. విషయం తెలిసిన పట్టణ సీఐ బోణం ఆదిప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. సమీపంలోని హోటల్‌లో ఉన్న సీసీ ఫుటేజీల్లో కిడ్నాప్ ఘటన నమోదు కావడంతో వాటిని సేకరించి పరిశీలిస్తున్నట్టు సమాచారం.

### అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలి
**ఏలూరు (టూటౌన్):** రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో వర్క్ అవుట్ సోర్సింగ్ పేరిట ప్రైవేటీకరణ విధానాన్ని అమలు చేయడానికి ప్రయత్నించడాన్ని సీఐటీయూ వ్యతిరేకిస్తోందని జిల్లా కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ అన్నారు. వర్క్ అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలంటూ శనివారం ఏలూరు ఆర్ఆర్‌పేట మస్తర్ పాయింట్ వద్ద కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. నెల్లూరులో ఈ విధానాన్ని సీఐటీయూ తిప్పికొట్టిందని, ఆ సందర్భంలో రాష్ట్రంలో మరెక్కడా అమలు చేయమని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ చెప్పారన్నారు. అయితే ఏలూరు కార్పొరేట్‌లో పనులను ప్రైవేట్ వ్యక్తలకు అప్పగించాలని చూస్తే ఊరుకోబోమని అన్నారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి ఎ.జానుబాబు, నగర కార్యదర్శి ఎం.ఇస్సాకు, జిల్లా కార్యదర్శి జె.గోపి పాల్గొన్నారు.

### నిబంధనలకు విరుద్ధంగా తరగతులు



నారాయణ విద్యాసంస్థల వద్ద ఆందోళన

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** నారాయణ, చైతన్య విద్యాసంస్థలు సెలవు రోజుల్లోనూ నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్నాయంటూ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో శనివారం తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలను మూయించివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థల్లో రోజులో కనీసం గంట కూడా క్రీడలు నిర్వహించకపోవడంతో విద్యార్థులకు మానసిక వికాసం, స్వేచ్ఛ ఉండటం లేదన్నారు. అలాగే ఎన్ శాట్ స్కాలర్‌షిప్ పేరుతో ఆదివారం నారాయణ విద్యాసంస్థలు నిర్వహించే పరీక్షకు ప్రభుత్వ అనుమతి లేదన్నారు. ఆయా సమస్యలపై విద్యాశాఖ అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు వై.అఖి, టి.వంశీ, ఎస్.రాజా పాల్గొన్నారు.

### కూటమి పాలనలో గీత కార్మికులకు కష్టాలు



భీమవరంలో మాట్లాడుతున్న నర్సింహమూర్తి

**భీమవరం:** కల్లుగీత వృత్తిని లేకుండా చేయాలనుకుంటే పాలకులకు భవిష్యత్ ఉండదని ఏపీ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నర్సింహమూర్తి హెచ్చరించారు. శనివారం భీమవరం సీఐటీయూ కార్యాలయంలో కామన మునిస్వామి అధ్యక్షతన జరిగిన కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి సహజసిద్ధమైన తాటికల్లును తెలుగుదేశం కూటమి ప్రభుత్వం కనుమరుగు చేసి కల్తీ మద్యాన్ని, అక్రమ మద్యాన్ని కుటీర పరిశ్రమలుగా నడుపుతున్నారని ధ్వజమెత్తారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా కిస్తీలు రద్దు చేసి గీత వృత్తిని లేకుండా కనుమరుగు చేయాలని నిర్ణయం తీసుకున్నారని, ఎన్నికల్లో ఓట్లు కోసం చేసిన వాగ్దానాలతో తమ తలరాతలు మారుస్తారేమో అని నమ్మి ఓట్లేసిన పాపానికి ప్రభుత్వం గీత కార్మికులకు చుక్కలు చూపిస్తోందని విమర్శించారు. గీత కార్మికులను కులాలుగా చీల్చి గీత వృత్తిని దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్న 75 వేల అక్రమ బెల్ట్ షాపులు తక్షణం తొలగించాలని, కల్తీ మద్యం అరికట్టి కల్లును ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. మునిస్వామి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కొత్త యంత్రాలతో కుటీర పరిశ్రమలుగా విస్తరించిన స్పిరిట్ మద్యాన్ని తక్షణం అరికడితేనే కల్లుగీత వృత్తి ఉంటుందన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు బొక్కా చంటి, కదలి పాండు, మామిశెట్టి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# నమ్మించి.. నట్టేట ముంచారు

**గూడు..గోడు**
- నాడు ఉచితంగా టిడ్కో ఇళ్లు ఇస్తామని కూటమి నేతల హామీ
- బ్యాంకు వాయిదాలు కట్టొద్దంటూ సూచన
- నేడు వాయిదాలు కట్టాల్సిందేనని సన్నాయి నొక్కులు
- హామీల నుంచి తప్పించుకునేందుకు అసత్య ప్రచారం
- బ్యాంకు అధికారుల హెచ్చరికలతో లబ్ధిదారుల బెంబేలు



పాలకొల్లులో టిడ్కో గృహ సముదాయాలు



బ్యాంకు అధికారుల హెచ్చరికలతో ఆందోళన వ్యక్తం చేస్తున్న మహిళలు (ఫైల్)

**పాలకొల్లు సెంట్రల్:** అధికారం కోసం ఎడాపెడా హామీలు ఇచ్చేయడం.. తీరా గద్దెనెక్కిన తర్వాత వాటి నుంచి తప్పించుకోవడానికి అసత్య ప్రచారం, ఎదురుదాడి కూటమి నేతలకు పరిపాటిగా మారింది. నాడు టిడ్కో లబ్ధిదారులు బ్యాంకు వాయిదాలు కట్టదంటూ చెప్పిన ప్రజాప్రతినిధులు.. నేడు కట్టాల్సిందేనంటూ సన్నాయినొక్కులు నొక్కుతున్నారు. ఎన్నికల సమయంలో కూటమి నేతల హామీలను నమ్మిన లబ్ధిదారులు నేడు లబోదిబోమంటున్నారు. ఇటీవల పాలకొల్లు నియోజకవర్గంలోని పెంకుళ్లపాడు టిడ్కో గృహాల వద్దకు బ్యాంకు అధికారులు వచ్చి బ్యాంకు వాయిదాలు చెల్లించాలని.. లేకుంటే ఫ్లాట్లకు తాళాలు వేస్తామని హెచ్చరించడంతో ఆందోళన చెందుతున్నారు.

**ఇష్టానుసారం హామీలు.. లబ్ధిదారులకు శాపాలు**

అధికారం కోసం గత ఎన్నికల ప్రచారంలో అప్పటి ఎమ్మెల్యే ప్రస్తుత మంత్రి నిమ్మల రామానాయుడుతో సహా టీడీపీ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు ఇష్టానుసారంగా టిడ్కో గృహాలపై హామీలు ఇచ్చారు. వీరి హామీలను నమ్మిన లబ్ధిదారులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలకు వాయిదాలు చెల్లించడం మానేశారు. దాని పర్యవసానం నేడు వడ్డీలతో సహా తలకు మించిన భారమైంది. అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి నేతలు భరోసా ఇవ్వాల్సింది పోయి బ్యాంకు వాయిదాలు కట్టేసుకోండని అంటున్నారు.

**తప్పును కప్పిపుచ్చుకునేందుకు..**

తాజాగా టిడ్కో ఇళ్ల వద్దకు బ్యాంకు అధికారులు వచ్చినప్పుడు పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేయగా వారిలో కొందరు టీడీపీ అభిమానులు ఉన్నారు. ఈ సంఘటన ప్రచారం ఎక్కువ కావడంతో టీడీపీ నేతలు పలు స్క్రిప్టులు సిద్ధం చేశారు. కొందరు లబ్ధిదారులకు తర్ఫీదునిచ్చి ఇదంతా జగన్ ప్రభుత్వం తప్పిదమని, తమ బ్యాంకు రుణాలను గత ప్రభుత్వం వాడేసుకుందని వీడియోలు ద్వారా తప్పుగా చెప్పించారు. ఇదిలా ఉండగా టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రుణాలన్నీ రద్దు చేస్తామని, ఉచితంగా ఇళ్లు ఇచ్చి శ్రావణ మాసంలో గృహప్రవేశాలు చేయిస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు, నిమ్మల లబ్ధిదారులను నమ్మించారు. ఇప్పటికీ రెండు శ్రావణాలు దాటినా ఈ హామీని ఎందుకు అమలు చేయలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

**రుణగ్రస్తులను చేసింది టీడీపీ నేతలే..**

నాలుగు రోజుల క్రితం టిడ్కో గృహాల వద్దకు బ్యాంకు అధికారులు వచ్చి వాయిదాలు, వడ్డీలు చెల్లించాలని లేకుంటే నోటీసులు పంపించి ఫ్లాట్లకు తాళాలు వేస్తామని హెచ్చరించారు. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇందుకు టీడీపీ నేతలే కారణమని అర్థమవుతుంది. 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో ఫ్లాట్లు ఇచ్చినప్పుడే బ్యాంకు రుణాలు అంశాన్ని తీసుకువచ్చారు. కేటగిరీ-1 ఫ్లాట్‌కు రూ.2.82 లక్షలు, కేటగిరీ-2 ఫ్లాట్లకు రూ.3.18 లక్షలు, కేటగిరీ-3 ఫ్లాట్లకు రూ.3.58 లక్షలు బ్యాంకు రుణంగా నిర్దేశించారు. ఈ మేరకు పాంప్లెట్లు కూడా పంచారు. ఇలా లబ్ధిదారులను బ్యాంకుల్లో రుణగ్రస్తులను చేసింది టీడీపీ నేతలు కాగా.. వీటిని మరిచి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే లబ్ధిదారులను బ్యాంకులో రుణగ్రస్తులను చేసిందని ఊపన్యాసాలతో ఊదరగొడుతున్నారు.

**లోన్లు కట్టాలంటున్న మంత్రి**

నెల క్రితం మంత్రి నిమ్మల ఇది మంచి ప్రభుత్వం అంటూ ఇంటింటికీ తిరిగారు. ఆ సమయంలో పలువురు మహిళలు టిడ్కో ఇళ్లు ఎప్పుడిస్తారు.. బ్యాంకు లోన్లు కట్టవద్దన్నారు.. ఇప్పుడు బ్యాంకు అధికారులు నోటీసులు ఇస్తున్నారు.. అంటూ మంత్రిని ప్రశ్నించారు. దీంతో బ్యాంకు లోన్లు కట్టేసుకోవాలి.. అవి ఆగవు కదా.. అని మంత్రి చల్లగా సెలవిచ్చారు. ఈ మాట ఎన్నికలకు ముందు చెప్పి ఉంటే తమకు వడ్డీ బాధలైనా తప్పేవి కదా అంటూ లబ్ధిదారులు వాపోతున్నారు.

**నాడు ఇళ్లు ఉచితమని భరోసా**

2019 ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేటగిరీ-1 లబ్ధిదారులకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించి అప్పగించారు. కేటగిరీ-2, కేటగిరీ-3 లబ్ధిదారుల్లో కొందరు బ్యాంకు వాయిదాలు చెల్లించారు. అయితే కోవిడ్ సమయంలో ఆర్థిక ఇబ్బందులతో వాయిదాలు కట్టలేకపోయారు. 2023లో ఇదే అదనుగా అప్పటి ఎమ్మెల్యే నిమ్మల లబ్ధిదారులను బ్యాంకులకు తీసుకువెళ్లి అధికారులను ప్రశ్నించారు. నిబంధనలు పాటించాల్సిందేనని బ్యాంకు అధికారులు చెప్పడంతో వాయిదాలు చెల్లించకండి.. బ్యాంకు అధికారులు వస్తే కట్టమని చెప్పండి.. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచితంగా ఇళ్లు ఇస్తామని భరోసా ఇచ్చారు. దీంతో లబ్ధిదారులు రుణాలు రద్దవుతాయని ఆశించారు. అయితే ప్రస్తుతం మంత్రి నారాయణతో సహా స్థానిక ప్రజాప్రతినిధి బ్యాంకు రుణాలు కట్టుకోవాలని చెప్పడంతో ఆవేదన చెందుతున్నారు.

## ప్రభుత్వమే వైద్య కళాశాలలు నిర్వహించాలి

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** వైద్య కళాశాలలు ప్రభుత్వ రంగంలో ఉంటేనే సేవా దృక్పథంతో పనిచేయగలవని, ప్రైవేటు వారికి అప్పగిస్తే వ్యాపార దృక్పథంతోనే పనిచేస్తారని జన విజ్ఞాన వేదిక పూర్వపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్ రమేష్ అన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వద్దు, ప్రభుత్వ రంగంలోనే నిర్వహించాలి అనే అంశంపై స్థానిక ఎస్ఆర్ పేటలో జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పీపీపీ విధానం ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడదన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి రిటైర్డ్ సూపరింటెండెంట్ రవి గోపాలకృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వ రంగానికి, ప్రైవేటు రంగానికి ఉన్న అంతరాన్ని వివరిస్తూ ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులు ఇతోధికంగా సేవ చేశాయన్నారు. రిటైర్డ్ జడ్జి అడబాల లక్ష్మి మాట్లాడుతూ కాలేజీల్ని ప్రైవేట్‌పరం చేయడం అంటే రాజ్యాంగ విలువలకి పాతర వేయడమే అన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్, సీపీఐ నాయకుడు బండి వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జేవీవీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

## ఎంటీఎస్ టీచర్లను క్రమబద్ధీకరించాలి

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** డీఎస్సీ-98 మినిమం టైం స్కేల్ టీచర్స్ (ఎంటీఎస్) విజ్ఞాపన దీక్ష రాష్ట్రవ్యాప్తంగా ఉన్న టీచర్స్‌తో శనివారం విజయవాడలోని ధర్నాచౌక్ వద్ద జరిగినట్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నాయకుడు కె.మోహన్‌రావు శనివారం తెలిపారు. దీక్షకు రాష్ట్రం నలుమూలల నుంచి ఎంటీఎస్ టీచర్లు హాజరయ్యారన్నారు. ఎంటీఎస్‌పై పనిచేస్తున్న టీచర్లను క్రమబద్ధీకరించాలని, మినిమం పెన్షన్ కల్పించాలని, అలాగే ఇతర సమస్యలు పరిష్కరించాలని ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు వినతులు ఇచ్చినట్లు వివరించారు.



దీక్షలో పాల్గొన్న ఉద్యోగులు

## మడుగుల్లా రోడ్లు.. ప్రయాణానికి పాట్లు

**భీమవరం (ప్రకాశం చౌక్):** భీమవరంలోని పలు వీధుల్లో రోడ్లు భారీ గోతులు, వర్షం నీటితో మడుగులను తలపిస్తున్నాయి. దీంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం గోతులు పూడ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టడం లేదు. వర్షాలు కురుస్తుండటంతో రోడ్ల నిర్మాణం, మరమ్మతులకు అవకాశం లేదని అధికారులు తప్పించుకుంటున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు రోడ్ల బాగోగులపై పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే పట్టణంలోని పలుచోట్ల పైప్‌లైన్ లీకేజీలతో తాగునీరు వృథా అవుతోంది. ఇలా పట్టణంలో 10 నుంచి 15 చోట్ల భారీ లీకేజీలు ఉన్నా మున్సిపల్ వాటర్ విభాగ అధికారులు పట్టించుకోవడం లేదు. దీని వల్ల తాగునీరు వృథాతో పాటు రోడ్లపై నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా ఉందని పట్టణవాసులు అంటున్నారు.

**జాతీయ రహదారిపై అధ్వానంగా..**

**భీమవరం:** భీమవరం నుంచి ఉండి వైపునకు వెళ్లే జాతీయ రహదారిపై పలుచోట్ల గుంతలు పడటం ప్రయాణికులకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తోంది. అయితే అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులే పలుచోట్ల స్వచ్ఛందంగా కర్రలకు సంచులు కట్టి హెచ్చరికలు ఏర్పాటుచేశారు. గుంతలు పూడ్చేందుకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



భీమవరం ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో భారీ గొయ్యి



భీమవరంలో జంట కాలువల వద్ద..



భీమవరం-ఉండి మధ్య జాతీయ రహదారిపై..

# పుంజులకు పందెం పాఠాలు



పందెంకోళ్లను ఆరుబయట కట్టిన దృశ్యం

పుంజులకు పందెం పాఠాలేంటీ అనుకుంటున్నారా? సంక్రాంతి కోడిపందేలకు పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం ఎంత ఫేమస్సో తెలిసిందే. రూ.కోట్లలో చేతులు మారడం ఒకెత్తయితే.. తమ కోడి.. పందెం కొట్టడం ప్రతిష్టాత్మకంగా భావించడం మరో ఎత్తు. పుంజులను పందేలకు సిద్ధం చేసేందుకు మూడు నెలల ముందు నుంచి పెద్ద కసరత్తే జరుగుతోంది. రానున్న సంక్రాంతి కోసం దసరా నుంచే పందేలరాయుళ్లు తమ పుంజులకు శిక్షణ ప్రారంభించారు.

**కోడ్ఢీ.. రెడీ**
- సంక్రాంతి పందేలకు శిక్షణ
- ఉదయాన్నే హాట్ వాటర్, వాకింగ్, స్విమ్మింగ్, వామప్
- మేతగా మటన్, గుడ్డు, బాదం, ఎండు ఖర్జూరం, వెల్లుల్లితో మెనూ
- ఒక్కో పుంజుకు రూ.30 వేల వరకు శిక్షణ వ్యయం
- 'పశ్చిమ'లో 200కు పైగా పెంపకం కేంద్రాలు
- సంక్రాంతి సీజన్‌కు రూ.10 కోట్లకు పైనే వ్యాపారం

సండే స్పెషల్



**సాక్షి, భీమవరం:** సంక్రాంతి పండగ రోజుల్లో భీమవరం, కోనసీమ ప్రాంతాల్లో రూ.కోట్లు వెచ్చించి ప్రత్యేకంగా బరులు ఏర్పాటుచేసి కోడిపందేలు నిర్వహిస్తుంటారు. వీటిని చూసేందుకు సినీ, రాజకీయ ప్రముఖులు ఎందరో తరలివస్తుంటారు. అందుకు తగ్గట్టే పుంజుల పెంపకంలో పందేలరాయుళ్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. అధిక శాతం మంది తమ ఇళ్లు, మకాంల వద్ద పుంజులను పెంచితే, పందగలకు దేశ విదేశాల నుంచి వచ్చేవారు తెలిసిన ట్రైనర్లతో శిక్షణ ఇప్పిస్తుంటారు.

**అంతా గోప్యమే :** కాకి, నెమలి, అబ్రాస్, డేగ, పచ్చకాకి, కేతువ తదితర జాతుల నుంచి రెండేళ్ల వయసు కలిగిన పుంజులను పందేలకు వినియోగిస్తుంటారు. పుంజుకు పోరాట పటిమ, శరీర పటుత్వం, శక్తిని పెంచేందుకు మూడు నెలల ముందు నుంచి ఎవరికి వారు ఎన్నో సంప్రదాయ, ఆధునిక పద్ధతులు పాటిస్తుంటారు. వాటికిచ్చే ఆహారం, మందుల నుంచి శిక్షణ వరకు ప్రతి విషయంలోనూ గోప్యత పాటిస్తారు.

**రూ.కోట్లలో వ్యాపారం..** మకాంల వద్ద పనిచేసేవారికి నెలకు రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు జీతాలుంటాయి. వీరు ఒక్కొక్కరూ 12 నుంచి 15 పుంజులను మాత్రమే పర్యవేక్షిస్తారు. నీళ్ల పోతలు, శాఖల కోసం వచ్చే ట్రైనర్లకు సిట్టింగ్‌కు కొంత మొత్తం మాట్లాడుకుంటారు. ఇవికాకుండా కోడికి అందించే ప్రత్యేక మేత, మందులతో ఒక్కో పందెం పుంజుకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చవుతుందంటున్నారు. వీటి జాతి, రంగు, ఎత్తును బట్టి రూ.50 వేల నుంచి రూ.లక్షల్లో అమ్ముతుంటారు. మామూలుగా ఇళ్ల వద్ద పెంచిన పుంజులు రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు అమ్మకాలు చేస్తుంటారు. పండగల కోసం నాలుగు వేలకు పైగా పందెం కోళ్ల అమ్మకాలు జరుగుతుంటాయి. వీటి ద్వారా రూ.10 కోట్లకు పైగా వ్యాపారం జరుగుతుందని అంచనా. పుంజులకు ఉన్న డిమాండ్‌తో జిల్లాలోని భీమవరం, ఉండి, ఆకివీడు, పాలకోడేరు, పాలకొల్లు, కాళ్ల తదితర మండలాల్లో 200కు పైగా నాటుకోళ్ల పెంపకం కేంద్రాలు ఉన్నాయి. కొందరు స్థలాలను లీజుకు తీసుకుని వీటి పెంపకం సాగిస్తుంటారు. సామర్థ్యాన్ని బట్టి ఒక్కోచోట వంద నుంచి 250 వరకు వివిధ రకాల జాతుల పుంజులు, కోళ్లను పెంచుతుంటారు.


### శిక్షణ మొదలవుతుందిలా..



కోడి పుంజును ఈత కొట్టిస్తున్న ట్రైనర్

ఉదయాన్నే పుంజును బయటకు తెచ్చి కొద్దిగా వేడి నీటిని పట్టిస్తారు. కాళ్లలో పటుత్వం, ఆయాసం రాకుండా, అనారోగ్య సమస్యలుంటే గుర్తించేందుకు నెలరోజుల పాటు రోజు విడిచి రోజు చెరువులు, నీటి తొట్టెల్లో ఈత కొట్టిస్తారు. 'వి' (ఇంగ్లిష్ లెటర్) ఆకారంలో నెట్‌లు కట్టి పుంజు అందులోనే తిరిగే విధంగా బేటా (నిర్ణీత పద్ధతిలో వాకింగ్) చేయిస్తారు. మరికొందరు ఖాళీ జాగాలో వాటి వెనుకే ఉండి తరుముతూ పరుగులు పెట్టిస్తారు. కోడి నోటి నుంచి వచ్చే కఫాన్ని తొలగించి శుభ్రం చేస్తారు. మేత పెట్టి 11 గంటల సమయం వరకు ఎండలో కట్టేసిన తర్వాత మకాంలోకి మార్చేస్తుంటారు. పండగలు దగ్గరపడే కొద్దీ పుంజు శరీరం గట్టిపడేందుకు, నొప్పులు తగ్గడానికి ప్రత్యేక ట్రైనర్లతో వేప, జామాయిల్, కుంకుడు తదితర ఆకులు, తుమ్మ బెరడు, తోక మిరియాలు, పసుపు కొమ్ములు తదితర 20 రకాలతో గంటల కొద్దీ మరిగించిన ద్రావణాన్ని కోడి తట్టుకునే వేడి వరకు చల్లార్చి పుంజును అందులో ఉంచి పైనుంచి ద్రావణం పోస్తూ వారంలో ఒకటి రెండుసార్లు నీళ్లపోతలు పోస్తారు. చివరిగా పొయ్యిపై మూకిడిని వేడిచేస్తూ అందులో చీప్ లిక్కర్ చిమ్మినప్పుడు వచ్చిన ఆవిరిని మెత్తటి గుడ్డకు పట్టించి దానిని కోడి శరీరం అంతా అద్దుతూ శాఖల చేయిస్తారు. పందేలకు ముందు అలసిపోకుండా నాలుగైదు రోజుల ముందు నుంచి పుంజుకు పూర్తి విశ్రాంతిని ఇచ్చేసి మకాంలో కట్టేసి ఉంచుతారు. ఈ ప్రక్రియలన్నిటినీ నిర్ణీత పద్ధతుల్లో చేయిస్తుంటారు.

### మెనూ ప్రత్యేకమే..



పందెం కోళ్లకు అందించే ప్రత్యేక మెనూ

పుంజులో శక్తి, సామర్థ్యం పెంచేందుకు, శరీరంలో కొవ్వు చేరకుండా తేలిగ్గా ఎగురుతూ ప్రత్యర్థిపై విరుచుకుపడేందుకు మూడు నెలలు ప్రత్యేక మేత అందిస్తారు. పుంజు బరువును బట్టి ఉదయం పూట 20 నుంచి 40 గ్రాముల వరకు ఉడకబెట్టిన మటన్, మూడు నుంచి ఐదు వరకు బాదం, రెండు వెల్లుల్లి, ఒక ఎండు ఖర్జూరం, కోడిగుడ్డు ముక్కలు చేసి పెడతారు. తిరిగి సాయంత్రం ఎప్పటిమాదిరి చోళ్లు, గంటులు, మెరికలు మొదలైన వాటిని అందిస్తారు. పుంజు అనారోగ్యం, వైరస్‌ల బారిన పడకుండా తరచూ పశువైద్యుడిని తీసుకువచ్చి పరీక్షలు చేయించి మందులు వేయించడం, మరెన్నో సంప్రదాయ ఆయుర్వేద పద్ధతులు అవలంబించడం చేస్తుంటారు.

## క్లుప్తంగా

### చెత్త వాహనాలకు మరమ్మతులు



రేలంగిలో జేసీబీతో చెత్త తొలగిస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

ఇరగవరం: ఇరగవరం మండలంలోని రేలంగి పంచాయతీలో చెత్త వాహనాలు మరమ్మతులకు గురై మూలకు చేరాయి. దీంతో ×మూలకు చేరిన చెత్త వాహనాల్లు అనే శీర్షికన శనివారం సాక్షి దినపత్రికలో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. కథనానికి స్పందించిన ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ మూలకు చేరిన చెత్త వాహనాలకు మరమ్మతులు చేపట్టారు. పేరుకుపోయిన చెత్తను, జేసీబీ సాయంతో శుభ్రం చేయించారు.

### నేడు చెస్ పోటీలు

భీమవరం: భీమవరం పట్టణంలో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ శనివారం చెప్పారు. స్థానిక తాలూకా ఆఫీసు సెంటర్‌లోని జీవీఆర్ కల్యాణ మండపంలో ఈ నెల 12వ తేదిన నిర్వహించే చెస్ పోటీల్లో విజేతలకు రూ.లక్ష నగదు బహుమతులు అందచేస్తామన్నారు. ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని ఆయన చెప్పారు.

### దాడి కేసులో నిందితులకు రిమాండ్

మండవల్లి: మండలంలోని పెరికెగూడెంలో సెప్టెంబర్ 2న దేవితల్లి అమ్మవారి నవరాత్రుల సందర్భంగా దాడి చేసిన ఇద్దరికి మేజిస్ట్రేట్ 14 రోజుల చొప్పున రిమాండు విధించినట్లు ఎస్‌ఐ రామచంద్రరావు చెప్పారు. పెరుమాల నరేంద్రబాబు, పిండి కర్ణబాబులు దేశిగణేష్‌పై దాడి చేసి గాయపర్చారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను న్యాయస్థానంలో హాజరుపర్చగా, రిమాండు విధించినట్లు తెలిపారు.

# మద్యం కిక్కులో జేబుకు చిల్లు

- లిక్కర్ షాపుల్లో అదనపు దోపిడీ
- ఒక్కో క్వార్టర్‌పై సుమారు రూ.20కి పైగా అదనంగా వసూలు
- ఏడాదికి సిండికేట్ 'అధనం' సుమారు రూ.40 కోట్లు

**నాడు** వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బెల్టు షాపులను పూర్తిగా తొలగించి.. కేవలం ప్రభుత్వ మద్యం దుకాణాలను ఏర్పాటు చేశారు. మద్యం షాపులు ఉదయం 10 నుంచి రాత్రి 8.30 గంటల వరకు మాత్రమే అందుబాటులో ఉండేలా టైమింగ్స్ పెట్టారు. మద్యం కొనాలంటే షాక్ కొట్టేలా.. చేస్తాననే మాటను నిజం చేస్తూ ధరలు పెంచటంతో పేదవర్గాల ప్రజలు మద్యానికి దూరం అయ్యారు. సిట్టింగ్ రూమ్‌లు లేకపోవటంతో మద్యం తాగేందుకు ఆసక్తి తగ్గింది.

**నేడు** కూటమి సర్కారు హయాంలో చంద్రబాబు మద్యాన్ని ఏరులై పారిస్తున్నారు. అనారోగ్యం వస్తే మందుల షాపులైనా తెరిచిఉంటాయో లేదో కానీ మద్యం కావాలంటే మాత్రం నో టైమింగ్స్. ఎనీ టైమ్ మద్యం (ఏటీఎం) తరహాలో మద్యాన్ని ఇష్టారాజ్యంగా విక్రయిస్తూ కూటమి నేతలు జేబులు నింపుకుంటున్నారు.. మందుబాబులకు రాత్రీ పగలూ తేడాలేకుండా మద్యాన్ని అందుబాటులో ఉంచారు. ఒక వైపు మద్యం షాపులు, మరో వైపు గ్రామగ్రామాన బెల్టు షాపుల లైట్లు నిత్యం వెలిగే ఉంటున్నాయి. చీఫ్ లిక్కర్ క్వార్టర్ బాటిల్‌పై సైతం రూ.20 అదనంగా బాదేస్తున్నారు.

ఏలూరు టౌన్ : ఏలూరు జిల్లాలో ప్రైవేటు మద్యం దుకాణాలు 155 ఉండగా.. కూటమి నేతలు, మద్యం సిండికేట్ చేతుల్లో ఏకంగా 1290కి పైగా బెల్టు షాపులు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో రెండు, మూడు బెల్టు షాపులు పెట్టుకుని మద్యం విక్రయాలు భారీ ఎత్తున చేస్తున్నారు. అన్ని చోట్లా విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తూ కూటమి నేతలు కోట్లు గడిస్తున్నారనే అభిప్రాయం ప్రజల్లో ఉంది. చింతలపూడి, కైకలూరు, నూజివీడు, దెందులూరు, పోలవరం ఏజెన్సీ ప్రాంతంలోనూ బెల్టు షాపుల హవా భారీ ఉంది.



ఎక్సైజ్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు



చంద్రబాబు చిత్రపటంపై మద్యం పోస్తూ నిరసన తెలుపుతున్న మహిళలు

### జేబులకు చిల్లు

మద్యం కిక్కులో మందుబాబుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. చీప్ లిక్కర్‌ను సైతం రూ.20 అధిక ధరలకు విక్రయిస్తున్నారు. జిల్లాలో నెలకు సగటున అధిక రేటు కారణంగా మందుబాబుల నుంచి కోట్లలో సొమ్ములు కాజేస్తున్నారు. జిల్లాలో ఒక నెలకు సుమారుగా 16.80 లక్షల క్వార్టర్ బాటిల్స్ విక్రయిస్తే ఒక్కో బాటిల్‌కు రూ.20ల చొప్పున అధిక ధరకు అమ్ముతున్నారు. నెలకు రూ.3.36 కోట్ల మేర మందుబాబుల మీద అదనంగా లాగేస్తున్నారు. ఏడాదికి చూస్తే కేవలం అధిక రేటు ద్వారానే సుమారుగా రూ.40 కోట్లు వరకూ కూటమి మద్యం సిండికేట్ వ్యాపారులు అదనపు ఆదాయాన్ని ఆర్జిస్తున్నట్లు అంచనా.

### కుటుంబాలు ఛిన్నాభిన్నం



కూటమి ప్రభుత్వంలో మద్యాన్ని ఏరులై పారిస్తూ ప్రజలను మద్యానికి బానిసలుగా మార్చేస్తున్నారు. రాత్రీ పగలూ తేడా లేకుండా ఇష్టారాజ్యంగా ప్రైవేటు మద్యం దుకాణాల్లో మద్యాన్ని అందుబాటులో ఉంచుతున్నారు. పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు, కూలిపనులకు వెళ్ళే వారు సంపాదించిన సొమ్మంతా మద్యానికే ఖర్చు చేస్తున్నారు. నిత్యం మందు అందుబాటులో ఉండేసరికి కుటుంబ యజమాని మద్యం తాగడంతో కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయి.

– కేసరి సరితారెడ్డి, ఏలూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు, వైఎస్సార్‌సీపీ

### అక్రమ మద్యాన్ని అడ్డుకోవాలి



రాష్ట్ర వ్యాప్తంగా అక్రమ మద్యం, కల్తీ మద్యం వ్యాపారం జోరుగా సాగుతుంది. అనేక చోట్ల కల్తీ మద్యం తయారు చేస్తున్న మద్యం మాఫియా గుట్టు బట్టబయలు అవుతుంది. కూటమి ప్రభుత్వం వారిపై చర్యలు తీసుకోవడంలేదు. ఏలూరు జిల్లాలో అక్రమ మద్యం వ్యాపారం భారీగా సాగుతుంది. టైమింగ్స్ లేకుండా అర్ధరాత్రి వరకూ మద్యం విక్రయిస్తూ.. మళ్ళీ తెల్లవారుజామునే దుకాణాలు తెరుస్తున్నారు. కూటమి నేతలే మద్యం షాపులను నిర్వహిస్తూ ఉండడంతో అధికారులు సైతం అటువైపు కన్నెత్తి చూడడం లేదు.

– జిజ్జువరపు విజయనిర్మల, ఏలూరు నగర మహిళ అధ్యక్షురాలు, వైఎస్సార్‌సీపీ

### ప్రజల ప్రాణాలతో చెలగాటం



కూటమి ప్రభుత్వం, నేతలు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఒకవైపు అక్రమ మద్యం, మరోవైపు కల్తీ మద్యంతో ప్రజలు మద్యానికి బానిసలుగా మారిపోయి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. కుటుంబంలో భర్త పనికి వెళ్ళకుండా మద్యం తాగుతూ వేధింపులకు గురిచేస్తూ ఉంటే... కుటుంబాలు నాశనం అవుతున్నాయి. మహిళలు అంతా ఈ కూటమి ప్రభుత్వానికి ఎందుకు ఓట్లు వేశామా ? అని బాధపడుతున్నారు. ప్రతీ గ్రామంలోనూ మద్యం బెల్టు షాపులు విచ్చలవిడిగా ఏర్పాటు చేశారు.

– నిట్టా లీలా నవకాంతం, దెందులూరు జెట్పీటీసీ

## శ్రీవారి క్షేత్రం.. భక్తజన సంద్రం



అనివేటి మండపంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రం శనివారం భక్తులతో పోటెత్తింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. దాంతో క్షేత్ర పరిసరాలు భక్తజన సంద్రమయ్యాయి. దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కల్యాణకట్ట, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ తదితర విభాగాలు భక్తులతో కిక్కిరిశాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది. సాయంత్రం 5 గంటల వరకు దర్శనం టికెట్లు, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.32 లక్షల ఆదాయం లభించినట్టు ఆలయ అధికారులు తెలిపారు. శ్రీవారి క్షేత్రంతో పాటు, పలు ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం అధిక సంఖ్యలో వివాహాలు జరిగాయి. దాంతో కొత్త జంటలు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు.



శ్రీవారి దర్శనార్థం ఆలయంలోకి వెళ్తున్న కొత్త జంటలు

### గోడను ఢీకొనడంతో వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతిచెందిన బత్తుల రామ్మోహన్‌రావు

నూజివీడు: ద్విచక్ర వాహనం అదుపు తప్పి గోడను ఢీకొన్న సంఘటనలో మండలంలోని తుక్కులూరుకు చెందిన బత్తుల రామ్మోహన్‌రావు(50) అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన శనివారం నూజివీడు మండలం మీర్జాపురం శివారు కంద్రికలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బత్తుల రామ్మోహన్‌రావు తక్కులూరులోని తన ఇంటి వద్ద నుంచి హనుమాన్‌జంక్షన్‌లోని బంధువుల ఇంటికి వెళ్తూ మధ్యాహ్నం 12 గంటల సమయంలో మీర్జాపురం శివారు కంద్రిక వద్దకు వచ్చే సరికి వాహనం అదుపు తప్పి గోడను ఢీకొట్టాడు. దీంతో అతను బండిపై నుంచి ఎగిరి కింద పడటంతో తలకు బలమైన గాయమై రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# మద్యం దుకాణాల్లో తనిఖీలు

సాక్షి ఎఫెక్ట్

తణుకు అర్బన్ : ×పశ్చిమలో మద్యం దందా× శీర్షికన సాక్షి దినపత్రికలో శనివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తణుకు ఎక్సైజ్ సీఐ సత్తి మణికంఠరెడ్డి తమ సిబ్బందితో కలిసి స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాల్లో శనివారం తనిఖీలు చేసి మద్యం బాటిల్స్ శాంపిల్స్ సేకరించారు. ఎక్కడా బెల్టు షాపుల నిర్వహణ జరగడంలేదని, ఇంతవరకూ తణుకు స్టేషన్ పరిధిలో 95 బెల్టు షాపులకు సంబంధించి కేసులు నమోదుచేసి వారి నుంచి 135.21 లీటర్ల మద్యం, 3.25 లీటర్ల బీరును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులందరినీ తహసీల్దారు కోర్టులో బైండోవర్ చేసినట్లు వివరించారు. తణుకులో ఒక మద్యం దుకాణంలో అదనపు ధరలకు విక్రయిస్తున్నట్లుగా ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసినట్లు చెప్పారు. అదనపు ధరలకు విక్రయిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.



తేతలి మద్యం దుకాణంలో మద్యం సీసాలు తనిఖీ చేస్తున్న సీఐ మణికంఠరెడ్డి



మద్యం దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి

**తాడేపల్లిగూడెంలో..**

తాడేపల్లిగూడెం: పశ్చిమలో మద్యం దందా కథనానికి ఎక్సైజ్ అధికారులు కదిలారు. గూడెం సర్కిల్ పరిధిలోని మద్యం దుకాణాలలో తనిఖీలు చేయడంతో పాటు, మద్యం నమూనాలు సేకరించి పరిశోధన శాలకు పంపించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే మద్యం విక్రయిస్తున్నారా.. లేదంటే అధిక ధరకు విక్రయిస్తున్నారా అనే విషయాలను పరిశీలించారు. బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్నారా అనే విషయాలను పరిశీలించారు. 40 మద్యం దుకాణాల్లో ధరలు పరిశీలించారు. ఇప్పటి వరకు స్టేషన్ పరిధిలో 134 బెల్టు దుకాణాలపై కేసులు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి అన్నారు. 226 లీటర్ల మద్యం, 7.8 లీటర్ల బీరును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

### నిట్‌లో ముగిసిన టెక్రియా



నిట్‌లో టెక్రియా 2కె25లో ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం: విద్యార్థుల సృజనాత్మక ఆలోచనలకు పెద్దపీట వేసే టెక్రియా 2కె25 కార్యక్రమం శనివారం నిట్‌లో ముగిసింది. విద్యార్థుల ప్రదర్శనలు ఆలోచింపచేశాయి. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గ్రాఫిక్ కేఫ్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మర్డర్ మిస్టరీ గేమ్ ఆలోచింపచేసింది. ఈసీఈ అసోసియేషన్ ఆధ్వర్యంలో కారుకి గైర్ స్కోప్‌ను అనుసంధానం చేసుకుంటూ అవరోధాలు అధిగమిస్తూ, గమ్యాన్ని ఎలా చేరుకోవచ్చనే విషయాలను విద్యార్థులు వివరించారు. నేచర్ క్లబ్ ఆధ్వర్యంలో ఎకో పెయింటింగ్ పోటీలో ఆకట్టుకున్నాయి. ముగింపు సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు జోష్‌ను నింపాయి.

### విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



నాగచంద్రరావు మృతదేహం

కొయ్యలగూడెం: విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో రామనుజపురంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టీ.నర్సాపురం మండలం శ్రీరామవరం గ్రామానికి చెందిన పరిటాల నాగచంద్రరావు (42) కొయ్యలగూడెం మండలం రామనుజపురంలో అన్న కుమార్తె వివాహానికి వచ్చాడు. ఇంటి ఆవరణలో చెత్తను శుభ్రం చేస్తూ ఉండగా, సమీపంలోని ఇనప ఊస అడ్డుగా ఉందని తొలగిస్తుండగా 11 కేవీ విద్యుత్ వైర్లకు తగిలింది. దీంతో షాకుకు గురైన నాగచంద్రరావు మృతి చెందాడని ఎస్సై వి.చంద్రశేఖర్ తెలిపారు.

**ఉండి మండలంలో మరొకరు..**

ఉండి: చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన బహదూర్(19) ఉండి మండలం ఆరేడులో శనివారం సాయంత్రం చేపల చెరువులో మేత వేసేందుకు వెళ్లగా చెరువు గట్టుపై ఉన్న విద్యుత్తు మోటర్ షాక్ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై ఎండీ నసీరుల తెలిపారు.

## చిచ్చర పిడుగులు

జిల్లా యువజన సేవ, క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఏలూరు ఇండోర్ స్టేడియంలో స్కేటింగ్ ట్రాక్‌పై జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. జిల్లా నలు మూలల నుంచి చిన్నారులు పాల్గొన్నారు. నాలుగు సంవత్సరాల నుంచి 10 ఏళ్ల వయసు ఉన్న వారికి జరిగిన ఈ పోటీల్లో అండర్–4 నుంచి అండర్–6 విజేతలుగా వై.తీరాజ్, ఎం.శ్రీయ, అండర్–6 నుంచి అండర్–8 పోటీల్లో దేవాంశ్, డి.శరన్ శ్రీవాస్తవ్, లక్ష్మి, అండర్–12 నుంచి అండర్–15 పోటీల్లో ఎన్.భువనరత్న శ్లోక గెలుపొందారు.



– సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు





స్కేటింగ్‌లో పోటీ పడుతున్న క్రీడాకారులు



### ● దేశ రక్షణలో నేను సైతం..



దేశ సరిహద్దు భద్రతా దళం సభ్యురాలిగా శిక్షణ పూర్తి చేసుకుని స్వగ్రామానికి వచ్చిన కంటుబోతు రమ్యకు దెందులూరు మండలం ఉంగ్రాజవరం గ్రామస్తులు శనివారం ఘనస్వాగతం పలికారు. కంటుబోతు నాగు, పద్మల కుమార్తె రమ్య బీకాం కంప్యూటర్స్ పూర్తి చేసింది. దేశభక్తితో ఎప్పటికైనా సెక్యూరిటీ ఫోర్స్‌లో చేరాలని నిర్ణయించుకుంది. తన కలను సాకారం చేసుకుంటూ 2022లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌లో దరఖాస్తు చేసుకుంది. 2023లో బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌కు ఎంపికై సంవత్సరం పాటు శిక్షణ తీసుకుంది. శిక్షణ పూర్తి చేసుకున్న రమ్య శనివారం ఉంగ్రాజవరం గ్రామానికి రావడంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఆమెకు స్వాగతం పలికారు. రమ్య తల్లిదండ్రులను సైతం గ్రామస్తులు అభినందించారు.

– దెందులూరు

### ● ఇదేనా 'చెత్త'శుద్ధి?



నూజివీడు పట్టణంలోని బస్టాండు వద్ద డ్రైనేజీలో చెత్త పేరుకోవడంతో అపారిశుద్ధ్యానికి నిలయంగా మారింది. గతంలో డ్రైనేజీ కల్వర్టులో నుంచి మురుగునీరు వెళ్లకపోవడంతో కల్వర్టు శ్లాబు కొంత తొలగించి అడ్డుపడ్డ చెత్తను తొలగించి మురుగునీరు వెళ్లేలా చేశారు. ఆ తరువాత పైభాగంలో శ్లాబు పోయకుండా వదిలేశారు. దీంతో డ్రెయిన్ నిండా చెత్త పేరుకుపోయింది. మరోవైపు ఈ డ్రెయిన్ ప్రమాదాలకు నెలవుగా మారింది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి డ్రైనేజీపై శ్లాబును నిర్మిస్తే పారిశుద్ధ్య సమస్యకు పరిష్కారం లభించడంతో పాటు ప్రమాదాలు నివారించవచ్చు.

– నూజివీడు

### మందుగుండు సామగ్రితో ముగ్గురి అరెస్ట్

ద్వారకాతిరుమల: అనుమతి పత్రాలు లేకుండా దీపావళి మందుగుండు సామగ్రిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. దొరసానిపాడులోని వేపాలమ్మ ఆలయం వద్ద శనివారం మధ్యాహ్నం వాహన తనిఖీలు చేస్తుండగా, ప్రగడవరానికి చెందిన బాలిన పృథ్వి, కాగిత సాయి కిరణ్, కొండ వీరబాబులు తాడేపల్లిగూడెం నుంచి ఒక ఆటోలో దీపావళి మందుగుండు సామగ్రిని స్వగ్రామానికి తరలిస్తూ పట్టుబడ్డారని పేర్కొన్నారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో వారిని అరెస్టు చేసి, రూ.47 వేలు విలువైన మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు. అనుమతి లేకుండా మందుగుండు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## క్లుప్తంగా

### ఎన్‌ఎంయూఏ ఆధ్వర్యంలో నిరసన



తణుకు ఆర్టీసీ డిపో ఆవరణలో నిరసన తెలుపుతున్న ఎన్‌ఎంయుఏ నాయకులు

**తణుకు అర్బన్:** ఏపీఎస్ ఆర్టీసీ తణుకు డిపోలో యాజమాన్యం కొత్తగా పెట్టిన హార్డ్ డ్యూటీ రెస్టాఫ్‌లు, తణుకు ఆర్టీసీ డిపో డ్రైవర్ జి.రామారావుపై అక్రమ సస్పెన్షన్‌లపై నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్‌ఎంయూఏ) ఆధ్వర్యంలో డిపో ఆవరణలో గేట్ మీటింగ్ ధర్నా నిర్వహించారు. ఇదే సమస్యలపై గత రెండు రోజులుగా ఎన్‌ఎంయుఏ ఆధ్వర్యంలో రెడ్ బ్యాడ్జిలతో నిరసన తెలిపారు. రెండు రోజుల గేట్ మీటింగ్ ధర్నాలకు యూనియన్ పిలుపునిచ్చినట్లు ఎన్‌ఎంయుఏ అధ్యక్షుడు ఎస్.ఏసుబాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిపో నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

### ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



ధ్యాన శిక్షణ తరగతులు

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** యోగా, ధ్యానంతో మానసిక ఆందోళనకు దూరంగా ఉండవచ్చునని యోగా గురువులు కరిబండి రామకృష్ణ, బడుగు చంద్రశేఖర్‌లు అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్స్ లయన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో స్థానిక గుణ్ణం ఫంక్షన్ హాల్, ఉమర్ ఆలీషా పీఠంలో ప్రత్యేక ధ్యాన శిక్షణ తరగతులు జరిగాయి. వక్తలు మాట్లాడుతూ మతిమరుపు, మానసిక ఆందోళన, ఆరోగ్య సమస్యలను ధ్యానం ద్వారా అధిగమించవచ్చునని తెలిపారు. యోగా సభ్యులు, లయన్స్ క్లబ్ డైమండ్స్ సభ్యులు పాల్గొన్నారు.

### వరాల వెంకన్నకు విశేష పూజలు



విశేష అలంకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

**అత్తిలి:** ఈడూరు గ్రామంలో వరాల వెంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు జరిపారు. వేకువ జామున సుప్రభాతసేవ, తోమాలసేవ, అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను జరిపారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. హాజరైన భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేశారు.

### రైతు అభ్యున్నతే లక్ష్యం



కెవికెలో ప్రధాని ధన ధాన్య కృషి యోజన కార్యక్రమాన్ని వీక్షిస్తున్న శాస్త్రవేత్తలు, రైతులు

**తాడేపల్లిగూడెం:** రైతుల అభ్యున్నతి, దేశ ఆహార భద్రతేలక్ష్యంగా కేంద్రంలోని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం పనిచేస్తోందని పలువురు వక్తలు తెలిపారు. స్థానిక ఉద్యాన వర్సిటీ విశ్వవిద్యాలయంలో నరేంద్రమోదీ ధనధాన్య కృషి యోజన పత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన పద్ధతులు, ఆత్మనిర్భరత సాధించాల్సిన ఆవశ్యకతల గురించి విశదీకరించారు. ఉద్యానవర్సిటీ విస్తరణ సంచాలకులు బి.గోవిందరాజులు విస్తరణ కార్యక్రమాల గురించి వివరించారు. యూనివర్సిటీ అధికారులు బి.శ్రీనివాసులు, సీహెచ్.మధుమతి, బి.ప్రసన్నకుమార్, ఎస్.సూర్యకుమారి, కె.ధనుంజయరావు విజయపద్మ, కూటమి నాయకులు భోగిరెడ్డి ఆదిలక్ష్మి, మంగాబాయి, వర్మ పాల్గొన్నారు.

### డీఎస్సీ 98 ఎంటీఎస్ టీచర్స్‌ను రెగ్యులర్ చేయాలి



విజయవాడ ధర్నాచౌక్‌లో నిరసన తెలుపుతున్న ఎంటీఎస్ టీచర్లు

**తణుకు అర్బన్:** మినిమమ్ టైమ్ స్కేల్ (ఎంటీఎస్) టీచర్స్‌ను రెగ్యులర్ చేయాలని, మినిమమ్ పెన్షన్ కల్పించాలనే ప్రధాన డిమాండ్స్‌తో శనివారం విజయవాడ ధర్నాచౌక్‌లో నిరసన తెలిపినట్లు ఎంటీఎస్ టీచర్స్ తెలిపారు. సుమారుగా రెండువేల మందితో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని తణుకు, తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల నుంచి పాల్గొన్నట్లుగా టీచర్స్ పాలంకి రామ బ్రహ్మ పతంజలి, కస్తూరి రఘుపతిరావు, పి. బెనర్జి, మంతెన శ్రీరామరాజు, కొండవీటి మోహనరావు, కొణతల నాగేంద్రప్రసాద్ తెలిపారు.

# పేదలకు అందని సర్కారు వైద్యం

- నమ్మెలోకి వైద్యులు.. ముదురుతున్న రోగాలు
- వైద్యులు లేక నర్సుల వైద్యమే దిక్కు
- విసిగిపోతున్న పేదరోగులు
- ఈనెల 3 నుంచి గాడి తప్పిన వైద్యసేవలు



ఇరగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పెరిగిన రోగుల తాకిడి

**తణుకు అర్బన్:** సర్కారు దవాఖానాల్లోని కొందరు వైద్యులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 3వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో సమ్మెబాట పట్టడంతో ఆయా ఆస్పత్రులకు వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోగాలబారిన పడుతూలేస్తూ ఆస్పత్రులకు వస్తున్న రోగులకు వైద్యులు అందుబాటులోలేరనే విషయంతో సగం ప్రాణం పోతున్న దుస్థితి నెలకొంది. దీంతో ఆస్పత్రుల్లో ఉన్న నర్సులు సెకండరీ వైద్యాన్ని అందించాల్సిన పరిస్థితి ఎదురైందని రోగులు వాపోతున్నారు. ప్రైవేటు వైద్యం అత్యంత ఖరీదైపోవడంతోపాటు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సర్కారు దవాఖానాల్లో ఖరీదైన వైద్యాన్ని పేదలకు అందుబాటులోకి తీసుకురావడంతో పేద, మధ్యతరగతి వర్గాలు ప్రభుత్వ ఆస్పత్రులకు అధిక సంఖ్యలో వెళ్లే పరిస్థితి ఏర్పడింది. కానీ నేడు వైద్యులు అందుబాటులో లేకపోవడంతో రోగాలు ముదరపెట్టుకుంటున్నామని, చివరకు చేసేదిలేక ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తుందని వాపోతున్నారు. తణుకు నియోజకవర్గంలోని జిల్లా కేంద్ర ఆస్పత్రి, మూడు అర్బన్ హెల్త్ సెంటర్‌లు, తణుకు, ఇరగవరం, అత్తిలి గ్రామాల్లోని పీహెచ్‌సీల్లో ప్రతిరోజూ 1500లకు పైగా రోగులు ఆయా ఆస్పత్రులకు వైద్యసేవలకు వస్తున్నారు. వైద్యుల సమ్మెతో ఉన్న మిగిలిన వైద్యులను ఆయా ఆస్పత్రుల్లో సర్దుబాటు చేయలేక వైద్యారోగ్య శాఖ, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ శాఖ ఉన్నత స్థాయి అధికారులు తలలుపట్టుకుంటున్నారు. అరకొరగా ఉన్న వైద్యులు రోజుకోచోట విధులు నిర్వర్తించే క్రమంలో తీవ్రంగా అలసిపోయి గందరగోళ పరిస్థితుల్లో ఉన్నారు.

**దక్కని గ్రామ వైద్యం..**

వైద్యారోగ్య శాఖ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ఆయా గ్రామాల్లోని ప్రజానీకం వైద్య సేవలు పొందుతుంటారు. కానీ వైద్యులు సమ్మెలోకి వెళ్లడంతో తొమ్మిది రోజులుగా రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈనెల 3 నుంచి వైద్యారోగ్య శాఖ వైద్యులు సమ్మెలోకి వెళ్లడంతో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ పరిధిలోని తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి నుంచి 7 గురు ఎంబీబీఎస్ వైద్యులు కొన్ని పీహెచ్‌సీల్లో విధుల్లోకి వేశారు. అయితే వారుకూడా 5వ తేదీ నుంచి పీహెచ్‌సీ వైద్యుల సమ్మెకు మద్దతు ఇవ్వడంతోపాటు వారి సమస్యల పరిష్కారంకోసం వారు కూడా సమ్మెబాట పట్టారు. ఈ కారణాలతో ఈనెల 3వ తేదీ నుంచి తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో 7గురు ఎంబీబీఎస్ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో మిగిలిన స్పెషలిస్ట్ వైద్యులపై ఆ భారం తీవ్ర రూపం దాల్చింది. దీంతో ఆస్పత్రికి వచ్చే సుమారు 700 అవుట్ పేషెంట్స్‌కు వైద్య సేవలు అందించే క్రమంలో ఉన్న వైద్యులు పంచుకోవాల్సిన దుస్థితి నెలకొంది. వైద్యుల కొరత కారణంగా రోగులు సైతం వైద్యం కోసం వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొందంటూ వాపోతున్నారు.

**రోజుకోచోట వైద్యం**

తణుకు నియోజకవర్గంలో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌కు సంబంధించి జిల్లా కేంద్ర ఆస్పత్రి ఉండగా పట్టణ పరిధిలో వైద్యారోగ్య శాఖకు సంబంధించి మూడు అర్బన్ హెల్త్ సెంటర్‌లు అందుబాటులో ఉన్నాయి. జిల్లా ఆస్పత్రిలో ఏడుగురు వైద్యులు సమ్మెలోకి వెళ్లగా, అర్బన్ హెల్త్ సెంటర్‌లలో ఉన్న వైద్యు లు రోజుకోచోటకు వైద్యం చేయాల్సి వస్తోంది. ఇక తణుకు రూరల్ పరిధిలోని వేల్పూరు పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు సమ్మెలో ఉన్నారు. దీంతో జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలోఉన్న లెప్రసీ విభాగ వైద్యుడిని వారంలో రెండురోజులు వేల్పూరు పీహెచ్‌సీకి, మరొక రెండు రోజులు రేలంగి పీహెచ్‌సీకి విధులు నిర్వర్తించేలా వేశారు. మిగిలిన రెండురోజులు లెప్రసీ విభాగంతోపాటు పీపీ యూనిట్‌లో ఫ్యామిలీ ప్లానింగ్ శస్త్రచికిత్సలు నిర్వహించాల్సి ఉంది. రేలంగి పీహెచ్‌సీలో ఇద్దరి వైద్యుల్లో ఒకరు విధుల్లో ఉన్నారు. ఇక అత్తిలి మండలంలోని అత్తిలి, మంచిలి పీహెచ్‌సీల్లో ఉండాల్సిన నలుగురు వైద్యులు సమ్మెలో ఉండడంతో వైద్యులు అందుబాటులో లేకుండాపోయారు. వైద్యారోగ్యశాఖ వైద్యం గాడి తప్పి రోగులు అల్లాడిపోతున్నారు. పీహెచ్‌సీ ల్లో ఏరోజు వైద్యుడు అందుబాటులోఉంటారో తెలియక రోగులు గందరగోళ పరిస్థితుల్లో ఉండి రోగాన్ని అలసత్వం చేయాల్సి వస్తుందన్నారు.

**వైద్యం గాడి తప్పింది**



పీహెచ్‌సీ వైద్యులు సమ్మెలోకి వెళ్లడంతో ఆస్పత్రులకు వచ్చే రోగులు వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యల పరిష్కారం కోసం వైద్యులు సమ్మెలోకి వెళ్లగా పీహెచ్‌సీల్లో వైద్యులు లేక పేద రోగులు తమ రోగాలకు వైద్యం దొరక్క అల్లాడిపోతున్నారు. సర్కారు ఆస్పత్రుల్లో వైద్యం అందక, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఖరీదైన వైద్యం చేయించుకోలేక పేదరోగులు తమ రోగాలను ముదరపెట్టుకునే పరిస్థితి దాపురించింది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం వైద్యుల సమస్యలు పరిష్కరించి వారిని అందుబాటులోకి తీసుకు వచ్చి పేదరోగులకు వైద్యం అందజేయాలి.

– బుదితి సుజన్‌కుమార్, వైఎస్సార్‌సీపీ దివ్యాంగ విభాగ జిల్లా అధ్యక్షుడు

### రోబోటిక్ సర్జరీలపై అవగాహన సదస్సు

**తాడేపల్లిగూడెం అర్బన్ :** భవిష్యత్తులో రోబోటిక్ సర్జరీలే ఆసుపత్రుల్లో నిర్వహిస్తారని డాక్టర్ నితిన్ రిమ్మలపూడి తెలపారు. స్థానిక పీఎస్ మూర్తి మెమోరియల్ సేవా సదన్ భవనంలో రోబోటిక్ సర్జరీపై అవగాహన సదస్సును తాడేపల్లిగూడెం, పెంటపాడు కమ్యూనిటీ పారామెడిక్స్ ప్రైమరీ కేర్ హెల్త్ ప్రొవైడర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిధిగా రాజమండ్రి డెల్టా హాస్పటల్స్ డాక్టర్‌నితిన్ రిమ్మలపూడి హాజరై రోబోటిక్ సర్జరీలపై అవగాహన కల్పించారు. డాక్టర్ సుమంత్ మండవ, ఆర్ క్రాంతికుమార్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

### వ్యక్తిపై కేసు నమోదు

**అత్తిలి:** మండలంలోని ఆరవల్లి గ్రామంలో కావలిపురపు విజయ్‌కృష్ణ అనే వ్యక్తిపై కొళ్లపర్తి పవన్ కుమార్ అనే వ్యక్తి ఇంట్లో చొరబడి గాయపరిచాడనే ఆరోపణపై పవన్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు అత్తిలి ఎస్సై పి. ప్రేమరాజు శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ గ్రామానికి చెందిన విజయ్‌కృష్ణ అత్తవారింట్లో ఉండగా దిరిసుమర్రు గ్రామానికి చెందిన పవన్ కుమార్ ఇంట్లో చొరబడి కొట్టడంతో విజయ్ కృష్ణ గాయపడటంతో చికిత్స నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడని, ఆసుపత్రి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు పవన్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

### బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్టు

**వీరవాసరం:** భీమవరం ప్రోహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఎక్సైజ్ పోలీసులు మండలంలో శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నౌడూరు గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తున్న కొణితవాడకు చెందిన ఎ.రామకృష్ణ అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 6 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎస్సై పి.ఉమా మహేశ్వర రావు, పి. సునీల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రెయిన్ నిర్మాణంపై అధికారుల మధ్య వాగ్వాదం



ఉరదాళ్లపాలెంలో డ్రెయిన్ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని కోరుతున్న స్థానికులు



ఉరదాళ్లపాలెంలో డ్రెయిన్ నిర్మాణ పనులను ప్రారంభించిన దృశ్యం

ఏకపక్షంగా పంచాయతీ అధికారులు చేపట్టడంతో ఆవేదన వ్యక్తం చేసిన స్థానికులు

**అత్తిలి:** మండలంలోని ఉరదాళ్లపాలెం గ్రామంలో పంచాయతీ నిధులతో సీసీ రోడ్డు వెంబడి నిర్మించే డ్రెయిన్ నిర్మాణ పనులను పంచాయతీ అధికారులు, పోలీస్ అధికారుల బందోబస్తు మధ్య చేపట్టడంతో స్థానికులకు, పంచాయతీ అధికారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. శనివారం అత్తిలి మండలం ఉరదాళ్లపాలెం గ్రామంలో సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులు చేపట్టడానికి పంచాయతీ అధికారులు జేసీబీతో వచ్చి రోడ్డుమార్జిన్ ఉన్న మెట్లు తొలగింపు పనులు ప్రారంభించారు. దీంతో నివాస గృహాలవారు పంచాయతీ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఇంటి ప్రహరీగోడకు ఆనుకుని తమ సొంత స్థలం ఉందని, తమ స్థలంలో డ్రెయిన్‌ను ఎలా నిర్మిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. పంచాయతీ అధికారులు ముందస్తుగా తమకు ఎటువంటి నోటీసులు జారీ చేయకుండా ఇంటి ప్రహరీగోడ వెంబడి ఉన్న మెట్లను తొలగించడాన్ని తప్పుబట్టారు. తమ ఇంటికి సంబంధించిన స్థలం డాక్యుమెంట్లు ప్రకారం కొలచి, అప్పుడు డ్రెయిన్ నిర్మించాలని పంచాయతీ అధికారులను కోరినప్పటికీ పోలీస్ బందోబస్తు మధ్య డ్రెయిన్ నిర్మాణ పనులను చేపట్టారు. నివాస గృహాల వారు డ్రెయిన్ నిర్మించే స్థలంపై కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో అడ్వకేట్ వచ్చి పంచాయతీ అధికారులతో రెండు రోజులపాటు గడు వు కోరినప్పటికీ ఏకపక్షంగా డ్రెయిన్ నిర్మాణ పనులు చేపట్టడంతో ఆప్రాంత ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సొంత స్థలంలో పంచాయతీ వారు డ్రెయిన్ ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. తమకు జరిగిన నష్టంపై సంబంధితశాఖ అధికారులపై కోర్టులో కేసు వేస్తామని, తగిన మూల్యం చెల్లించక తప్పదని గృహ యజమానులు హెచ్చరించారు.

## ఉమానాగేశ్వరశాస్త్రికి సత్కారం



నాగేశ్వరశాస్త్రి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

**పెంటపాడు:** శ్రీశైల భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రధానార్చకునిగా పనిచేసి ఇటీవల పదవీ విరమణ చేసిన పండితారాధ్యుల ఉమానాగేశ్వరశాస్త్రి దంపతులను పెంటపాడు వాసులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించిన రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి ఉపాధ్యక్షుడు నల్లమిల్లి అంజిరెడ్డి స్థానిక పూడిగుడి వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. గూడెం అడ్వకేట్ సంఘ నాయకులు శిరిగినీడి విజయకృష్ణ, దారపురెడ్డి శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ కొవ్వూరి లక్ష్మణరెడ్డి, మాజీ డైరెక్టర్ కర్రి వరహాల రెడ్డి, డాక్టర్ దాసరి సతీష్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు కొవ్వూరి విజయభాస్కరరెడ్డి, నిముషకవి సూర్యనాగేశ్వరరావు, వెలగల శ్రీనివాసరెడ్డి, పెంటపాడు రెడ్డి యూత్ సంఘ సభ్యులతో పాటు, గ్రామ ప్రముఖులు, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అక్రమార్కుల చేతికి కోడేరు ఇసుక



మామిడిశెట్టి సుబ్రహ్మణ్యాన్ని అభినందిస్తున్న నాయకులు

**పెనుగొండ:** ఆచంట మండలంలో కోడేరులో లభించే ఇసుక ఆదాయం అక్రమార్కుల పాలైందని వైఎస్సార్ సీపీ మండల కమిటీ కన్వీనరు జక్కంశెట్టి చంటి తెలిపారు. శనివారం కోడేరులో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయులు సుంకర సీతారామ్, కోట వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి కోడేరులో ఇసుకను అక్రమంగా తరలించుకుపోయారని ఆరోపించారు. గతంలో ఇసుక ద్వారా వచ్చే ఆదాయంతో కోడేరు గ్రామాభివృద్ధికి సహకరించేవారన్నారు. ప్రస్తుతం టీడీపీ తినుకో దోచుకో..పంచుకో అనే రీతిలో స్థానిక ఉన్నత ప్రజా ప్రతినిధితో పాటు గ్రామంలోని టీడీపీ నాయకులు ఇసుకను దోచేసుకున్నారని విమర్శించారు. కూటమి నాయకుల అరాచక పాలనకు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మామిడిశెట్టి సుబ్రహ్మణ్యాన్ని నియమించినట్లు పేర్కొన్నారు. అలాగే యువజన విభాగం అధ్యక్షుడిగా లంకపల్లి సుందరరాజు, రైతు విభాగం అధ్యక్షుడిగా మేడిది రెడ్డియ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కోట భాస్కరరావు, బీసీ సెల్ అధ్యక్షుడిగా మామిడిశెట్టి త్రిమూర్తులు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా మైలే రాధలతో పాటు, 20 మంది కార్యవర్గ సభ్యులను నియమించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముత్యాల నాగేశ్వరరావు, దేవరపు సూర్యనారాయణ, పమ్మి సురేష్, కొమ్ముల రాంబాబు, సరిపల్లి వెంకటరత్నం, కుసుమే పెద్దిరాజు, కట్టా గణపతిరావు, బొంతు శ్రీను, మేడిది జయ, కోట ప్రసాద్, యల్లమెల్లి నాగేశ్వరరావు, సరేళ్ల మోహనరావు పాల్గొన్నారు.

## లింగ అసమానతలపై అవగాహనతో ఉండాలి



పోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

**పెనుగొండ:** ప్రపంచవ్యాప్తంగా బాలికలు ఎదుర్కొంటున్న లింగ అసమానతలపై ప్రజల్లో అవగాహన పెంచాలని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ వి.ప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా పోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. విద్య పోషణ, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ హింస, బలవంతపు బాల్యవివాహాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేశారు. బాలికలు, యువతలు వారి వారి రంగాలలో పరిశోధనలకు సంబంధించి సాధించిన అభివృద్ధిని తెలియపరచి వారిలో స్ఫూర్తిని నింపాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కేబీకేఎస్ రమేష్ రెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి జె.సత్యనారాయణ, పీహెచ్ఎన్ ఎస్.మీరమ్మ, సీహెచ్ఓ వై.వీరమ్మ, హెచ్‌సీహెచ్ పద్మజ, ఏఎన్ఎంలు శ్రీదేవి, శేషారత్నం, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

### రూ.26 వేలు కనీస వేతనం ఇవ్వాలి

**నరసాపురం:** అంగన్‌వాడీ, ఆశ కాంట్రాక్ట్ ఉద్యోగులకు రూ.26 వేలు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం సీఐటీయూ మండల మహాసభ స్థానిక సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయన్నారు. కార్మికులను బానిసలుగా ప్రభుత్వం చూస్తుందని అన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కవురు నర్సింహస్వామి, చింతా రాజారెడ్డి, రావూరి మాణిక్యాలరావు, పులపర్తి రత్నకుమారి పాల్గొన్నారు.

# చెత్త తొలగదు.. మురుగు పారదు



వల్లూరుపల్లి గ్రామంలో మురుగునీరు కదలకుండా నిలిచిన దృశ్యం



పరిమెళ్లలో దుర్వాసన వెదజల్లుతున్న మురుగుబోదెలు



అలంపురం గ్రామంలో ఒక చోట ఏరులా పారుతున్న మురుగుబోదె

- విజృంభిస్తున్న వ్యాధులు
- పట్టించుకోని పాలకులు
- ఇదేనా.. స్వచ్ఛభారత్ అంటే..

**పెంటపాడు:** సమయపాలన లేని వాతావరణం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక పక్క తీవ్రమైన ఎండా, మరో పక్క కుండపోత వానలతో ప్రజలు తీవ్రంగా సతమవుతున్నారు. గత వారం రోజుల నుంచి జిల్లాలో ఏదో ఒక మారుమూల ప్రాంతాలలో ప్రతి రోజూ ఈ దృశ్యం నిత్యకృత్యమవుతోంది. రెండు రోజులు నువ్వు... అటు తరువాత నేను అన్న చందాన ఎండా, వానలు పోటీపడి మరీ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. జిల్లాలో ప్రతి రోజూ ఏదో ప్రాంతంలో సాయంత్రం సమయంలో వర్షం కురుస్తూనే ఉంది. ఉదయం అయితే మళ్లీ మొదలు. దీంతో ప్రజా జీవనానికి అంతరాయం కలుగుతోంది. వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. వీటికి ప్రధాన కారణం గ్రామాల్లో శుభ్రత లేకపోవడమే. ప్రతి గ్రామంలోనూ నిత్యం ఏదో ప్రాంతంలో డ్రెయినేజీలు పొంగి ప్రవహిస్తున్నాయి. పారిశుద్ధ్య కార్మికులు కానరావడం లేదు. బ్లీచింగ్ చల్లేవారు కూడా కనిపించడం లేదు.

**వ్యాధుల జోరు:**

ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఈ వాతావరణ తరుణంలో వ్యాధుల తీవ్రత కూడా ఎక్కువగా ఉంటోంది. చిన్నారులు, వృద్ధులు ఆపసోపాలు పడుతున్నారు.మండుతున్న ఎండలకు తోడు అనుకోని అకాల వర్షాలు తోడయ్యాయి. ఈ ప్రతికూల వాతావరణం వల్ల చిన్నారులు, వృద్ధులు జ్వరాలు బారిన పడుతున్నారు. దీనికి తోడు గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ఎక్కడ చూసినా చెత్త, మురుగు డ్రెయిన్లు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. ఈ వర్షం వల్ల దోమలు మరింత విజృంభిస్తాయి. వీటివల్ల చికెన్‌గున్యా, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులు బారిన పడుతున్నారు.

**వైద్యుల ధర్నాతో అందని వైద్యం:**

మరో పక్క పీహెచ్‌సీలలో వైద్యుల ధర్నాలతో సకాలంలో సరైన వైద్యం అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సబ్‌సెంటర్లు ఉన్న గ్రామాల్లో సీహెచ్‌వోలు చేసే సేవలకు రోజుకు 150–200 సంఖ్య ఉన్న రోగులు సీహెచ్‌వోలు లేక 40–60కి పడిపోయింది. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనపడుతోంది. జగనన్న ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన గ్రామీణ వైద్యం ధర్నాల వల్ల నేడు అందడం లేదు. గ్రామాల్లో దగ్గు, జ్వరం కేసులు నమోదు అవుతున్నా, మందులిచ్చే వారు కరువయ్యారు. దీంతో ఎంతో ఖర్చు పెట్టుకొని పేదలు కార్పొరేట్ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. సబ్‌సెంటర్‌ల సేవలు అరకొరగానే ఉన్నాయి. ఈ సందర్భంగా వైద్యాధికారులు తక్షణం జ్వరాల కేసులు నమోదు అవుతున్న గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించి, సకాలంలో వైద్యసేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

### పౌష్టికాహారం పంపిణీ

**భీమవరం:** స్థానిక మానవత సంస్థ ఆధ్వర్యంలో భీమవరం ప్రభుత్వాసుపత్రి ఏఆర్టీ సెంటర్‌లో శనివారం హెచ్ఐవీ బాధిత కుటుంబాల పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ బుద్ధరాజు వెంకటపతిరాజు, అధ్యక్షుడు చింతలపాటి రామకృష్ణంరాజు మాట్లాడుతూ ప్రతి నెలా రెండో శనివారం హెచ్ఐవీ కుటుంబాల పిల్లలకు ప్రభుత్వం అందించే మందులతో పాటు సంస్థ సభ్యుల సహకారంతో క్రమం తప్పకుండా పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నామన్నారు.